# క్షీరసాగరమథనం

వెయ్యిన్నీ తొమ్మన్నూట ముప్ఫయినాలుగో సంవత్సరం ఫిబ్రవరి యిరవై రెండో తేదీ ఆంధ్రపత్రికలో యీకింది ప్రకటన వుంది.

## వరుడు కావాలి

మహారాజరాజశ్రీ, శ్రీమద్యజనయాజనాధ్యయనాధ్యావనదానప్రతిగ్రహషట్కర్మ నిరతులైన, శ్రీవేదమూర్తులయిన, బ్రహ్మశ్రీ, శ్రీశ్రీశ్రీ, శ్రీరాజా, రాజాబులుసు వీరావధానిపంతులు బహద్దరు కొల్లాయపేట జమీందారు ఎం.ఎల్.సీ గారి యేకపుత్రిక శ్రీమతి నాగరత్నమ్మగారు మళ్ళీ పెళ్లిచేసుకోడానికి నిశ్చయించుకున్నారు.

శ్రీరాజాబహద్దరువారికి శ్రీనాగరత్నమ్మగారు తప్ప వేరే సంతానం లేదు. కలగనేలేదు కూడానూ. కనక శ్రీరాజాబహద్దరువారి యావదాస్తీ శ్రీ నాగరత్నమ్మగారికే దఖలుపడుతుంది. వారసులకు వెళ్లిపోడాని కిది పిత్ర్యం కాదు. శ్రీరాజాబహద్దరువారు సాటిలేని ఘనాపాఠీలు కనక ఛప్పన్న దేశాలూ తిరిగి స్వదేశసంస్థానాల్లో సంపాదించిన వార్షికాలమీద పెరిగిన వడ్డీపెట్టి సకల రాజచిహ్నాలతోటి కొనుక్కున్న స్వార్జితం యీ జమీన్‌దారీ. తతిమ్మా చరస్థిరవసతులుకూడా పూర్తిగా శ్రీరాజాబహద్దరువారి స్వార్జితాలే.

శ్రీరాజాబహద్దరువారికి జమీన్‌దారీవల్లా, యినాములవల్లా, శేరీలవల్లా, వడ్డీలవల్లా, సాలీనా లక్షాయాభై వేల రూపాయలు వస్తాయి.

శ్రీమతి న్నాగరత్నమ్మగారి వయస్సు పందొమ్మి దేళ్లు. వారు సంస్కృతం, పంచకావ్యాలూ చదివారు. తెనుగుల్లో మంచి పాండిత్యం కుదిరింది. ముద్దుగా వీణ వాయిస్తారు. మోటారు నడపగలరు. గుర్రపుస్వారి కూడా అలవాటుంది.

శ్రీరాజాబహద్దరువారు వొక దొరసాని నేర్పరిచి శ్రీ నాగరత్నమ్మగారిని కాశీహిందూవిద్యాలయం తాలూకు మెట్రిక్యులేషన్ పరీక్షకు తయారుచేయిస్తున్నారు.

వరనిర్ణయంతో శ్రీరాజాబహద్దరువారికి గాని, శ్రీరాణీ సాహేబావారికి గాని యేమీ జోక్యం లేదు. ఆవిషయంలో శ్రీమతి వధువుగారి యిష్టమే చట్టం. విధానం కూడా వారు నిర్ణయించిందే.

వరు దేశాఖవా దయినా సరే బ్రాహ్మ దయితే చాలు. వయస్సు మాత్రం యిరవై రెండేళ్లకు పైనీ, యిరవై ఆరేళ్లకు లోపునా వుండాలి.

వరుడు రెండో పెళ్లి వాడయినా యిబ్బంది లేదు. అయితే: అలాంటి సందర్భంలో సంతానవంతుడుగా మాత్రం వుండకూడదు.

వరుడికి ఆస్తి వుంటే విశేషం లేదు. లేకపోతే విచారమున్నూ లేదు. ఉండడమే వస్తే వున్నదంతా తన వారికి విడిచిపెట్టేసి కట్టుగుడ్డలతో యిల్లరికం రావడానికి తయారుగా వుండాలి.

వరుడికి తగినంత చదువూ, చదువుకంటే జ్ఞానమూ, జ్ఞానంకంటే ప్రజ్ఞా అవసరం. ఆపైని చక్కదనం కూడా చాలా అవసరమే.

వరుడికి కట్నంగాని, జమీన్‌దారీమీదా, తతిమ్మా ఆస్తిమీదా హక్కులు గాని యెంతమాత్రమూ యివ్వబడవు; కాని తమ అల్లుడిగారి సొంత సాదర్లకోసం, శ్రీరాజాబహద్దరువారు, ప్రతీనెలా కొంత సొమ్ము దయచేయిస్తూ వుంటారు. అయితే: ఆమొత్తం నిర్ణయించేవారు మాత్రం శ్రీ నాగరత్నమ్మగారే.

మార్చి యిరవై రెండోతేదీ సాయంత్రం మిథున లగ్నంలో వివాహం జరుగుతుంది.

ఇష్ట మున్న యువకులు మార్చి వొకటో తేదీ వుదయం 9-10 గంటలమధ్య దేవిడీదగ్గిర హాజరు కావాలి. ఎనిమిదో తేదీ సాయంత్రం పదిగంటల దాకా కొల్లాయపేట దివాణంలో వుండాలి.

ఆసాయంత్రం భోజనా లయినాక, సకలపరివారమూ, బంధువులూ, మిత్రులూ, అతిథులూ బలిసివున్న నిండుకొలువులో, శ్రీరాజాబహద్దరువారు, వచ్చిన అభ్యర్థులలో నచ్చిన వొకరిని పిలిచి తమతో అర్ధాసనంమీద కూచోపెట్టుకోడం రూపంగా వరనిర్ణయం వెల్లడిచేస్తారు.

తతిమ్మా అభ్యర్థులకు రానూ పోనూ ఖర్చులిచ్చి ఆరాత్రి రైళ్లకే సెలవు లిచ్చేస్తారు.

వచ్చినవారిలో యెవరూ నచ్చకపోతే శ్రీనాగరత్నమ్మగారు వరనిర్ణయంలో మరొక పద్ధతి అవలంబించగలరు.

అభ్యర్థులకు దేవిడీలోకి వచ్చేదాకా స్వాగతాది సత్కారా లేమీ జరగవు. వెళ్లిపోయాటప్పుడు సాగనంపులు కూడా దేవిడీదాకానే జరుగుతాయి.

వచ్చిన క్షణం మొదలు వెళ్లే క్షణందాకా అభ్యర్థులు దివాణం సొమ్ముతోనే అవసరాలు తీర్చుకోవాలి.

శ్రీరాజాబహద్దరువారిది గౌతమసగోత్రం.

రాజమండ్రి

ఇట్లు

25-2-1934

దూర్వాసుల వెంకప్ప చయనులు,

దివాన్.

తా॥ క॥ కొల్లాయపేట దివాణం, రాజమండ్రీలో జెయిలురోడ్డున గోదావరిస్టేషనుకి మైలున్నరలో వుంది.

# 2

ఆంధ్రపత్రిక 2-3-34.

## కొల్లాయుపేట రాజపుత్రి వివాహం

(మా ప్రత్యేక విలేఖకురాలు)

రాజమండ్రి, మార్చి 1:-

ఉదయం తొమ్మిదిన్నర అయింది. తూర్పునుంచీ పడమటినుంచీ వచ్చే వుదయపు రైళ్లన్నీ వెళ్లిపోయాయి. కానయితే, అప్పటి కప్పుడే యెండ కొంచెం చుర్రు మంటూనే వుంది. అయినా, పక్కని జలపూర్ణమైన పెద్ద తటాకమూ, చుట్టూ పూలమొక్కలూ, తీగలూ, చెట్లూ వుండడంవల్లా, పందిలిమీద తొలినాడే కొత్త తాటాకులు వెయ్యవడ్డంవల్లా ఆ ప్రదేశం చల్లగానూ, రమణీయంగానూ కూడా వుంది.

దేవిడీకి యెదురుగా, యిరవై గజాలలో వున్న పందిట్లో వొకవేపున వొక కుషనుసీటూ, దానికి రెండు పక్కలా రెండు సామాన్యపు కుర్చీలూ, వెనక నాలుగైదు గజాలదూరంలో మూడు సోఫాలూ, వొక పేము కుర్చీ, యెదట రెండు సోఫాలూ, వాటిమధ్య వొక వెదురుకుర్చీ వెయ్యబడివున్నాయి. పందిటికీ రాజభవనం పోర్టికోకి మధ్యవున్న గానుగుచెట్టుక్రింద అయిదారు బల్లలూ, వాటిమీద బంధుమిత్రులూ వున్నారు.

మొట్టమొదట వొక శాలువమాత్రం కప్పుకుని వున్న దివాన్జీవారు వచ్చి పందిలిమధ్య నుంచున్నారు. తరవాత దేవిడీపక్కని వున్న అతిథుల బంగళాలోనుంచి అయిదుగురు యువకులను తీసుకవచ్చి, ఠాణేదారుగారు, ఇద్దరిద్దర్ని వొక్కొక్క సోఫామీదా, వొకణ్ణి వెదురుకుర్చీమీదా కూచోబెట్టారు.

ఇది జరిగిన వొక్క క్షణానికి పురోహితులవారు వేదమంత్రా లుచ్చరిస్తూ ముందు రాగా, శ్రీ రాజావారు రూపొందిన బ్రహ్మతేజస్సులా ప్రకాశిస్తూ వచ్చి కుషను సీటుమీద ఆసీను లయినారు. వారిని చూడడంతోటే అభ్యర్థు లయిదుగురూ లేచినుంచున్నారు; కాని వెదురు కుర్చీలో కూచున్న అభ్యర్థి మాత్రమే నమస్కారం చేశాడు. శ్రీరాజాబహద్దరువారు వెనక రాణీసాహెబా వారు దయచేసి వెనకవరసలోవున్న కుర్చీలో ఆసీనులయినారు. వారి వెనక, వరసగా నలుగురు యువతులూ, వారివెనక వొక దొరసానీ వచ్చి, అందరూ మూడు సోఫాలమీదా కూచున్నారు.

అప్పుడు దివాన్‌జీవారు అభ్యర్థులను చూసి "మీ రొక్కక్కరే మీ విషయం చెప్పండి" అనగా మొదటి అభ్యర్థి యిలా చెప్పాడు.

"మాది కాకినాడ. మాయింటిపేరు మద్దూరివారు. మేము నలుగురం అన్నదమ్ములం. నేను ముడోవాణ్ణి. నాకింకా వివాహం కాలేదు. వయస్సు

ఇరవైనాలుగేళ్లు. బి. ఏ. ఆనర్సు చివరి సంవత్సరం మద్రాసులో చదువుతున్నాను. మానాయనగారు సబ్ జడ్జీ పని చేసి పెన్షను పుచ్చుకుని రెండేళ్లకిందట కాలంచేశారు. నాపేరు జగన్మోహన్"

ఇతను నల్లగా, పొట్టిగా, బొద్దుగా వున్నాడు. ఫ్రెంచి కట్టింగుమీసాలు. క్రాపు యెగదువ్వాడు. సూటు వేశాడు. కాని పంట్లాము పొదులుజంగాళంగా వుంది. వొకచేత టెన్నిస్‌బేటూ, వొకచేత హిందూపత్రికా వున్నాయి. చూపులు వెనకవరసలో వున్న యువతుల మీదనే వాలుతూ యేమిటో వెదుకుతున్నట్టున్నాయి.

రెండో అభ్యర్థి యిలా చెప్పాడు.

"మాది విశాఖపట్నం. మాయింటిపేరు కౌతావారు. నాకు అన్నదమ్ములూ, అక్క చెల్లెళ్లూ లేరు. మా నాయనగారు కలెక్టరు కచేరీలో వొక పెద్దగుమాస్తాగా వున్నారు. నావయస్సు ఇరవై అయిదేళ్లు. ఇద్దరు భార్యలు పోయినారు. నేను బి. ఏ. బి. ఈడీ పరీక్షలలో నెగ్గి, ప్రస్తుతం మిషన్‌స్కూల్లో అక్టింగు చేస్తున్నాను. నాపేరు అప్పడు పంతులు"

ఇతను బక్కబలాచగా, పొడుగ్గా, నల్లగా వున్నాడు. మీసాలున్నాయి. క్రాపింగుమీద టర్కీటోపీ. కాళ్లకి ఆకుచెప్పులు, కారాకిల్లీ వేస్తాడు కాబోలు పళ్లు గారకట్టి వున్నాయి. చూపులు తరుచు దొరసానివేపుకీ, పురోహితునిమీదకీ తిరుగుతున్నాయి. రెండు కాళ్లూ వూగిసలాడిస్తూ సోఫాలో చేరబడికూచుని వున్నాడు.

వెదురుకుర్చీలో కూచున్న మూడో అభ్యర్థి యిలా చెప్పాడు.

"మాది రామచంద్రపురం. మాయింటిపేరు హోతావారు. మానాయనగారు హైస్కూల్లో టీచరుగా వుంటూ రెండేళ్లకిందట చనిపోయారు. నాకు ఇద్దరు చెల్లెళ్లున్నారు. కాపరాలు చేసుకుంటున్నారు. స్కూలు ఫైనలుతో నాచదువు పూర్తి అయింది. అరుమాసాలు నౌకరీకోసం ప్రయత్నించి విఫలుణ్ణయి, మరో అరుమాసాలు బస్సు డ్రెవరుగావుండి నూటయాభై రూపాయలు సంపాదించుకొని, యీడాదినించి రాజమహేంద్రవరంలోనే సోడాషాపూ, కిల్లీదుకాణమూ పెట్టుకుని పొట్టపోసుకుంటున్నాను. పెళ్లి ప్రయత్నంలో వుంటూ తమ ప్రకటన చూశాను. మూడు మాసాలకిందట మోటారు సైకిలు రైడింగులో నాలుగువందల రూపాయలూ, మరో వారంరోజులకి యీతపందెంలో నూరు రూపాయలూ గెల్చాను. వయస్సు ఇరవై రెండు దాటింది. పేరు రాజగోపాలశాస్త్రి. ప్రస్తుతం విద్వాన్ ఫైనలుకి తయారవుతున్నాను"

ఈమాటలు ఇతను నుంచుని చెప్పాడు. శరీరం దబ్బపండువన్నె, పొడుగూ కాకుండా, పొట్టీ కాకుండా, కొంచెం పుష్టిగా, చాలా చురుకైన చూపులతో - ఆకర్షించే రూపం. పంచె కట్టి, షర్టుమాత్రం తొడుక్కుని పైని కండువా కప్పుకుని వున్నాడు. చూపులు శ్రీరాజా బహద్దరువారిమీద మాత్రమే నిలిచివున్నాయి. ఇతని వృత్తాంతం విని పురోహితుడు వులిక్కిపడ్డాడు. దివాన్‌జీ వారు ప్రభువుకేసి చూశారు. తక్కిన అభ్యర్థులు నలుగురూ వెటకారంగా చిరునవ్వు నవ్వారు. గానుగుచెట్టు కింద

యేవో గుసగుసలు బయలుదేరాయి. ఠాణేదారు మొగం పక్కకి తిప్పుకుని చెయ్యి అడ్డం పెట్టుకున్నాడు. శ్రీరాణీసాహెబావారి కనుబొమ్మలు ముడిపడ్డాయి. యువతులు గతుక్కుమన్నారు.

రెండోసోఫాలో మొదట కూచున్న నాలుగో అభ్యర్థి యిలా చెప్పాడు.

"మాది బందరు. ఇంటిపేరు ప్రవావారు. మానాయనగారు ప్లీడరుగుమాస్తాగా వుంటూ కాలంచేశారు. నాకు సోదరసోదరీమణు లెవ్వరూ లేరు. మాతల్లిగారు వ్యక్తి సత్యాగ్రహోద్యంలో పనిచేసి ప్రస్తుతం శ్రీకృష్ణజన్మస్థానంలో వున్నారు. నా మొదటి భార్య శ్రీకృష్ణజన్మస్థానంలో ప్రసవించి వైద్యసహాయం తక్కువ కావడంవల్ల పిల్లతో కూడా కాలం చేసింది. ఫోర్తుఫారం చదువుతూ నేను నాన్‌కోఆపరేషన్‌లో పాఠశాల విడిచిపెట్టాను. ప్రస్తుతం రాష్ట్రభాషాపరీక్షలో నెగ్గి హిందీ ప్రచారం చేస్తున్నాను. మహాత్మాగాంధీగారు నాతో తరుచు వుత్తరప్రత్యుత్తరాలు జరుపుతూ వుంటారు. హిందీ సాహిత్యసమ్మేళనానికి నేను దక్షిణభారత ప్రతినిధిని. వయస్సు - మొన్ననే యిరవై ఆరోయేడు పూర్తి అయింది. నా పేరు ప్రస్తుతం కామ్‌చంద్"

ఇతను ఎర్రగా, లావుగా, పొడుగ్గా వున్నాడు. మీసాలు లేవు. కళ్లకి జోడూ, నెత్తిమీద గుజరాతీటోపీ, కద్దరులాల్చీమీద వేస్టుకోటూ, చేతిలో వొక హిందీ మాసపత్రికా - వుత్తర దేశీయుడులా వుంటాడు. పక్క జేబులోనుంచి బీడీలకట్ట తొంగిచూస్తోంది. చూపులు దొరసానిమీద చాలా తీవ్రంగా ముసురుకుంటున్నాయి. తన సంగతి చెప్పేటప్పు డితను వుపన్యాసం చెబుతూవున్నట్టు కొద్దిపాటి ఆవేశమూ, ఆత్మవిశ్వాసమూ కనపరిచాడు.

అయిదో అభ్యర్థి యిలా చెప్పాడు.

"మాది ఏలూరు. ఇంటిపేరు యనమండ్రవారు. మా నాయనగారు నాచిన్నతనంలోనే స్వర్గస్థులయినారు. నేను కవిని. దేశంలో నాతో పోల్చతగ్గ భావకవి మరిలేడు. నేను రాసిన ఖండకావ్యాలు భారతం అంత గ్రంథం అవుతుంది. పద్యాలు చదవడానికి ప్రతీసభకీ నాకు ఆహ్వానాలు వస్తాయి. నాకు పదిపన్నిండుగురు శిష్యులున్నారు. నాప్రణయలేఖలు చూసి టాగూరు గుండెలు బాదుకున్నాడు. నారచన లేకుండా తెనుగులో యెవరూ పత్రిక నడపలేరు. నోబుల్ ప్రయిజుకోసం గ్రంథం వొకటి యింగ్లీషులో రాద్దామని వుంది. నాకు అన్నదమ్ములూ, అక్క చెల్లెళ్లూ వున్నారు; కాని వాళ్లకి సౌందర్యపిపాస లేకపోవడంవల్ల హోటల్లో భోజనం చేస్తూ నేను ప్రత్యేకంగా వొక రూములో వుంటున్నాను. నాపేరు ప్రస్తుతం నవీనచంద్ర. నాగ్రంథం వొకటి, మధుశలాటువులు, అనే పేరితో మొన్ననే ప్రకటించబడింది. అది భావకవిత్వానికి అంకితం అయింది. దాన్ని స్కూలు ఫైనలుకి పాఠ్య గ్రంథంగా పెట్టించవలసిందని నాశిష్యు లందరూ వచ్చే నెలలో వైస్‌ఛాన్సలర్‌గారి దగ్గిరికి డిప్యుటేషను వెళ్లబోతున్నారు. వైస్‌ఛాన్సలరుగారు ఆమోదించారంటే డైరక్టర్ ఆఫ్ పబ్లిక్ ఇన్‌స్ట్రక్షన్సు అంగీకరించి అలా చేసితీరతాడు"

ఇతను పొడుగ్గా, సన్నంగా, నల్లగా వున్నాడు. గిరజాలక్రాపు. కళ్లకి జోడు. పట్టులాల్చీ. కాళ్లకి బర్మాస్లిప్పర్లు. చేతిలో వుబికివున్న వొక ఫైలుంది. ఎప్పుడూ చిరునవ్వుతో వుండడానికి ప్రయత్నిస్తూవుంటాడు. అరచూపులతోనే గాని ఎవరినీ కళ్లువిప్పి బాగా చూడడు. సిజర్సు సిగరెట్టు పెట్టె జేబులో వుంది. దివాన్‌జీవారి ప్రశ్నకి యితను "చిన్నతనంలో అయింది పెళ్లి. ఆపిల్లని నేను ప్రేమించడం లేదు. దానికీ నాకూ సంబంధం లేదు. కోర్టు ఎక్కి మనోవర్తి ఏర్పాటు చేశాను" అని బదులు చెప్పాడు.

ఠాణేదారుగారు ఈవాజ్మూలా లన్నీ రాసుకుని రాజాబహద్దరువారి చేతికిచ్చారు. అవి పుచ్చుకుని, వారు, వొక చీటీ ఠాణేదారుగారికీ, వొక కవరు దివాన్‌జీవారికీ దయచేశారు. దివాన్‌జీవారు కవరు విప్పి అందులో వున్న నూరేసి రూపాయలనోట్లు అయిదు తీసి, వొక్కొక్కటి వొక్కొక్క అభ్యర్థి కిచ్చి, "ఇవి మీరిక్కడ వున్న వారం రోజులూ స్వేచ్ఛగా ఖర్చు పెట్టుకోవచ్చు. చాలకపోతే యింకా కావలసినంతా యిస్తాము. సొమ్మేమీ మీరు ముందరా యివ్వనక్కర లేదు; కాని యెనిమిదో తేదీ సాయంత్రం నాలుగుగంటలకు సరియైన జమాఖర్చుమాత్రం యివ్వాలి" అని చెప్పారు.

ఇంతలో ఠాణేదారుగారు, రాజాబహద్దరువారు రిచ్చిన చీటీకి అయిదుప్రతులు తయారుచేసి, దివాన్‌జీవారి యింగితం కనిపెట్టి అభ్యర్థుల కయిదుగురికీ యిచ్చారు. వాటిలో వున్న విషయం యిదీ.

"జమీన్‌దార్లు శ్రద్ధ చెయ్యవలసిన విషయం యేమిటి?"

తరవాత శ్రీరాణీసాహేబావారు అంతఃపురంలోకీ, దొరసానీ, యువతులూ టెన్నిస్‌కోర్టుకి చేరివున్న క్లబ్బుభవనంలోకీ దయచేశారు. శ్రీరాజాబహద్దరువారు దివాన్‌జీవారితో యేదో మాట్లాడుతూ తటాకాన్ని తిరగవేసుకుని కచ్చేరీలోకి వేంచేశారు. పురోహితులవారు గానుగుచెట్టుకిందికి వెళ్లి బంధుమిత్రవర్గంలో చలోక్తులకు అంకురార్పణ చేశారు.

తరవాత, ఠాణేదారుగారు, అభ్యర్థులను పిలుచుకుని అతిథుల బంగళాకు దారితీశారు. పదిబారలు వెళ్లాక, భావకవి, "అయ్యా! ఆయువతులలో రాజపుత్రిక యెవరండీ?" అని అడగ్గా, ఠాణేదారుగారు, "మీరు అప్రశ్న వెయ్యకూడదు. వారిలో వొకామె మాత్రం రాజపుత్రి. వారు నలుగురూ వొక్క శిక్షణలో పెరిగారు. పైగా అందరూ రూపవతులు. ఈవారంరోజులలోనూ వారి అభిరుచులు కావలసినంతవరకూ మీకు తెలుస్తాయి. మీ అభిరుచులు వారికి తెలుస్తాయి. ఇందుకోసమే యీసన్నివేశం యేర్పరచబడ్డది. వారిలో రాజపుత్రి యెవరైనా ఆమె మిమ్ము అంగీకరించేయెడల ఆమెని వివాహం చేసుకోడానికి మీరు సిద్ధపడి వుండాలి. అలా అంగీకరించలేనివారికి ఇక్కడ తావు లేదు" అని కచ్చితంగా సెలవిచ్చారు. దీనిమీద తతిమ్మావా రెవరూ ఏమీ ఆలోచనలో పడ్డట్టు లేదు; కాని భావకవి మాత్రం కొంచెం అసంతృప్తి పొందినట్టుంది.

వారి నక్కడచ దిగబెట్టి ఠాణేదారుగారు వెడుతూ వెడుతూ "పదకొండయేదాకా యువతులు క్లబ్బులో వార్తాపత్రికలు చదువుకుంటారు. శ్రీరాజాబహద్దరువారు, కచేరీలో, గుమాస్తాలు నిన్న చేసిన పని తనిఖీ చేస్తారు. పదకొండుం బావుకి భోజనశాలలో గంట కొడతారు. వెంటనే అందరూ అక్కడ చేరుకుంటారు. నేను వచ్చి మిమ్మల్ని తీసుకువెడతాను సిద్ధంగా వుండండి" అని సెలవిచ్చారు.

## 3

మధ్యాహ్నం భోజనాల దగ్గిర కాకినాడ, విశాఖపట్నం అభ్యర్థులు తమ విస్తళ్లూ పరిసరాలూ పశువుల కొట్టాలుగా తయారుచేశారు. వారు తిన్నదానికంటే పారేసిం దెక్కువ. పైగా వొకరు లొట్టలు వేసీ, వొకరు ధ్వనిచేసీ అందరికీ చిరాకు పుట్టించారు. రాజమండ్రీ అభ్యర్థి తన కక్కరలేనిది వడ్డించనివ్వలేదు. వేయించుకున్నది దిగబెట్టలేదు. సామాన్యమైన పట్టుపంచె కట్టుకురావడం తప్ప అతను మరేమీ అసభ్యంగా ప్రవర్తించలేదు. బందరు అభ్యర్థి వరి అన్నం తినడం చాలా అసందర్భమనీ, హిందూస్థానీలను చూసి నేర్చుకుని గోధుమరొట్టెలు పుచ్చుకోవాలనీ, గోధుమరొట్టెలు తినడంవల్లనే వారు మనకంటే నాగరికులుగా వున్నారనీ, వారి భాష హిందూదేశానికి జాతీయ - మాతృభాషగా వుండడానికి అర్హమైనదయిందనీ, భోజనాల దగ్గిర హిందీ మాట్లాడుకుంటే ముక్తి కూడా వస్తుందనీ, వాల్మీకీ, శ్రీరాముడూ, శ్రీకృష్ణుడూ హిందీలోనే మాట్లాడారనీ, మతాన్ని పట్టి కూడా మనం హిందీ తప్పకుండా నేర్చుకోవాలనీ చిన్న వుపన్యాసం చేశాడు. భావకవి మెతుకులు చేతితో తాకీతాకకుండా, పెదవులు కదిపీకదపకుండా విస్తరంతా కోళ్లు కెక్కరించినట్టు కెక్కరిస్తూ సగంసగం తిని లేచాడు.

భోజనానంతరం ఠాణేదారుగారు తాంబూలాలు తీసుకురాగా కాకినాడ విశాఖపట్నం అభ్యర్థులు "బసలోకి తీసుకురండి" అంటూ చక్కాపోయారు. హిందీప్రచారకుడు "మనలో మనమాట. బరంపురం మసాలా యేమేనా వుందా లేదా" అని అడిగి, ఠాణేదారుగారు ముక్కు మీద వేలుపెట్టుకోగా చిన్న తాంబూలం చేత్తో పుచ్చుకుని వెళ్లిపోయాడు. భావకవి వొక్క యేలకిపండు మాత్రం తీసుకున్నాడు. కిల్లీలదుకాణదారు మాత్రం సావకాశంగా తాంబూలం వేసుకుని, తన వృత్తిని గురించిన ఠాణేదారుగారి సందేహాలు కొన్ని తీర్చి చక్కా వెళ్లాడు.

మూడున్నరకి ఫలహారాలు. కాకినాడ అభ్యర్థి కాఫీ పుచ్చుకుంటూ కోప్పా, మార్బిలు టేబిలుమీద విడిచిపెట్టి ముక్కా చెక్కా చేసాశాడు. విశాఖపట్నం అభ్యర్థి పకోడీలలో వున్న పచ్చిమిరపకాయ ముక్కలు బల్లకిందికి తుబుకూ తుబూకూ వుమ్మేసి, కాఫీలో సగం బల్లమీద వొంచేశాడు. దుకాణదారు ఫలహారం నిమిషంలో పూర్తిచేశాడు. హిందీప్రచారకుడు "ఫలహారంలో నేనా చపాతీలు లేకపోవడం యేమీ

బాగా లేదండీ" అంటూ, వులుకూ వులుకూ చూస్తూ, తీపి పుచ్చుకుని కాఫీ ఆస్వాదించి వెళ్లిపోయాడు. భావకవి, తీపి అయిన తరవాత వొక పకోడీ, కాస్త కాఫీ, మళ్లీ పకోడీ, మళ్లీ కాఫీ-ఇలాగ సగంసగం పుచ్చుకున్నాడు.

అయి దయింది. యువతులు నలుగురూ టెన్నిస్ ప్రారంభించారు. దొరసాని పక్కని కూచుని సలహాలు చెబుతోంది. భావకవి కలమూ నోటుబుక్కూ పుచ్చుకుని యువతులు తనకి కనబడేటట్టు కొంచెం దూరంగా వొక పూవుటీరంలో కుచున్నాడు. హిందీప్రచారకుడు దొరసానికేసి వొక్క మాటు తీవ్రంగా చూసి (పళ్లు కూడా కొంచెం కొరికా డనే నానమ్మకం) తటాకతీరానికి వెళ్లిపోయాడు. కాకినాడ అభ్యర్థి టెన్నిస్‌బాటు పుచ్చుకుని కోర్టుకి సమీపంగా వొక పక్కని కూచుని, బంతి తన వేపుకి వచ్చిన రెండుమూడు మాట్లూ పరిచారికలు పరిగెత్తుకుని వస్తూ వుండినా తానే కోర్టులోకి గిరవాటు వేశాడు. తరవాత వొక పరిచారిక వచ్చి "యిది స్త్రీలు ఆడుకొంటూవున్న చోటు. అవతలికి వెళ్లండి" అని చెప్పగా, ఏమీ సమాధానం చెప్పలేక బాటుతోటే జెయిలువేపుకి షికారు వెళ్లిపోయాడు. విశాఖపట్నం అభ్యర్థి గాఢనిద్రలోవున్నాడు. దుకాణదారు తన గదిలో యేదో పుస్తకం చూసుకుంటూ కుచున్నాడు.

రాత్రి భోజనాల వేళ అభ్యర్థుల కందరికీ వసారాలో వడ్డించారు. యువతులు నలుగురూ శ్రీరాజాబహద్దరు వారి యెదట కూచున్నారు.

## 4

ఆంధ్రపత్రిక, మార్చి 3:-

రాజమండ్రి, మార్చి 2:-

ఉదయం అరున్నర అయింది. శ్రీరాజాబహద్దరువారు స్నానసంధ్యాద్యనుష్ఠానా లన్నీ ముగించుకుని దివాన్‌జీవారితో మాట్లాడుతూ మేడమీద వసారాలో కూచున్నారు. దుకాణదారు యీతాలాడుతూ తటాకంలో స్నానం చేస్తున్నాడు. కాకినాడ అభ్యర్థి తనకి వేన్నీళ్లు కావాలని ఠాణేదారుగారికి కబురుచేశాడు. విశాఖపట్నం అభ్యర్థీ, భావకవీ యింతట్లో మేలుకునేటట్టులేదు. హిందీప్రచారకుడు "నేను సబ్బులు బహిష్కరించాను. సున్నిపిండి పంపించండి" అని లోపలికి కబురుచేసి, పరిచారిక పచ్చని సున్నిపిండి తెచ్చి యివ్వగా తెల్లపోతూ తటాకతీరాన కూచుని వున్నాడు.

7 గంటలకు వంటలక్క టిఫిన్ తీసుకురాగా దుకాణదారు గప్‌చిప్‌గా పుచ్చుకున్నాడు. కాకినాడ అభ్యర్థి "స్నానం తరవాత చేస్తాలెండి" అని తానుకూడా సిద్ధపడ్డాడు. విశాఖపట్నం అభ్యర్థి పక్కమీదా లేదు, బంగాళాలోనూ లేదు. భావకవి "ఇడ్డీ యింత దళసరిగా వుందేం? సాంబారు చెయ్యడం చేతకాదూ? వుప్మాలో బంగాళాదుంప కూర లేకపోతే యేం బాగుంటుందీ?" అని విమర్శిస్తూ వంటలక్కని

విసిగించి చివరికి "ఏదో-ఆకలి చావాలి కదా?" అంటూ సగంసగం పుచ్చుకున్నాడు. హిందీ ప్రచారకుడు మూడు కప్పులు కాఫీ మాత్రం పుచ్చుకున్నాడు.

భోజనాలవేళ: అభ్యర్థులను అతిథులలో కూచోబెట్టారు. కాకినాడ అభ్యర్థి 'ఇంగ్లీషులో యేదో గొణుక్కుంటూ భోంచేశాడు. బావకవి నిన్నటికంటేనూ తక్కువ తిని భోజనాలు సగంసగంలో వుండగా లేచిపోయాడు. విశాఖపట్నం అభ్యర్థికి ధ్వని యెక్కువయింది. హిందీప్రచారకుడు పులుసూ, చారూ తాకలేదు. పెరుగు వద్దని పాలు తెప్పించుకుని పోయించుకున్నాడు. దుకాణదారు సావకాశంగా భోజనం చేసి అందరితోటీ సమానంగా లేచాడు.

తాంబూలాల విషయం నిన్నటిలాగే జరిగింది. ఎవరికీ బసలోకి పంపలేదు.

మధ్యాహ్నం మూడుగంటలకు దుకాణదారు పడుకుని ఏదో ఆలోచించుకుంటున్నాడు. తక్కిన నలుగురూ నిద్రలో వున్నారు. వంటలక్క దుకాణదారుకి టిఫిన్ ఇచ్చి వెళ్ళిపోయింది. తక్కిన నలుగురూ నాలుగింటికి లేచి టిఫిన్‌కోసం కబురు పంపి విఫలులై బజారుకి వెళ్లిపోయి రాత్రిభోజనాలకు గంట కొడుతూ వుండగా వచ్చారు. ఆరావడంలోనూ కాకినాడ అభ్యర్థీ, విశాఖపట్నం అభ్యర్థీ మోటారు సైకిలు మీద వచ్చారు. హిందీ ప్రచారకుడు సైకిలుమీద వచ్చాడు. భావకవిని దింపేసి జట్కావాడు వెళ్లిపోయాడు. వారు నలుగురూ స్నానాలు చెయ్యకుండానే భోజనానికి వెళ్లారు. దుకాణదారు స్నానం చేసి సిద్ధంగా వున్నాడు.

భోజనాలు - అభ్యర్థులను ఈపూట శ్రీ రాజాబహద్దరువారి యెదట కూచోపెట్టారు. కాకినాడ అభ్యర్థిలో మార్పేమీ కనపడలేదు. విశాఖపట్నం అభ్యర్థి చారూ మజ్జిగా మాత్రమే పోసుకున్నాడు. హిందీప్రచారకుడు పాలతో మాత్రమే తిన్నాడు. దుకాణదారు మామూలుగా భోజనం చేశాడు.

భోజనాలు కాగానే కాకినాడ అభ్యర్థీ, విశాఖపట్నం అభ్యర్థీ మోటారుసైకిలుమీద సినీమాకి వెళ్లి, పన్నెండు గంటలవేళ వచ్చి తలుపులు తియ్యకపోగా ట్రావెలర్సు బంగాళాకు వెళ్లి పడుకున్నారు.

దొరసాని పియానో వాయిస్తుందని కబురురాగా హిందీ ప్రచారకుడు మొగంపక్కకి తిప్పుకుని పళ్ళుకొరికిపోయి పడుకున్నాడు. భావకవి యువతులెవరేనా పాడతారా అని అడిగి, జవాబు రాకపోగ కవిత్వంలో కూచున్నాడు. దుకాణదారుమాత్రం వెళ్ళి పాటపూర్తి అయిదాకా కూచుని వచ్చాడు.

❀ ❀ ❀ ❀

ఆంధ్రప్రతిక. మార్చి 4,

రాజమండ్రి, మార్చి 3:-

ఉదయం యెనిమిదిన్నర అయింది. శ్రీరాజాబహద్దరువారు పోర్టికోలో పడకకుర్చీ వేయించుకుని కూచుని కాకినాడ అభ్యర్థికి కబురంపారు. సంభాషణలో అతను పెద్దలతో మాట్లాడ్డం యెరగనట్టు కనపడ్డాడు. తరవాత విశాఖపట్నం అభ్యర్థి

వచ్చి ఎగుడుదిగుడుగా జవాబులు చెప్పాడు. భావకవి శ్రీరాజాబహద్దరువారి ప్రశ్నలు ఆపుచేయించి, యీ రెండురోజుల్లోనూ తాను రాసిన పద్యాలు ఝామ్మని చదివి వినిపించి వెళ్ళిపోయాడు. అప్పటికి పదిన్నర అవడంవల్ల తక్కినవారికి కబుర్లు రాలేదు.

భోజనాలు - శ్రీరాజాబహద్దరువారి యెదట వొకర్నీ, అతిథులలో యిద్దర్నీ, బంధువులలో యిద్దర్నీ కూచోపెట్టారు. ఏమీ మార్పులు కనపడలేదు.

తాంబూలాలు యథాప్రకారమే.

కాకినాడ, విశాఖపట్నం అభ్యర్థులు చీట్లాటలో కూచున్నారు. భావకవి నిద్రా ముద్రితుడయినాడు. దుకాణదారు వార్తాపత్రిక పుచ్చుకోగా హిందీప్రచారకుడు వచ్చి హిందీ అవసరమని వుపన్యాసం చేశాడు.

❀ ❀ ❀ ❀

ఆంధ్రపత్రిక మార్చి 5:-

రాజమండ్రీ మార్చి 4:-

ఉదయం ఏడున్నర - తనకి ప్రతీపూటా టెన్నిస్ ఆట అలవాటనీ, అది లేకపోతే తోచదనీ, ఎనిమిదో తేదీ సాయంత్రం దాకా కోర్టు తన స్వాధీనంలో వుంచవలసిందనీ కోరుతూ కాకినాడ అభ్యర్థి చీటీ రాశాడు. విశాఖపట్నం అభ్యర్థి తనతో ఆడతాడనీ, తాను సొంతబాటు తెచ్చుకున్నాననీ, విశాఖపట్నం అభ్యర్థి అద్దెబాటు తెచ్చుకున్నాడనీ అతనందు వుదహరించాడు. దానిమీద, శ్రీరాజాబహద్దరువారు, రాజపుత్రి అభిప్రాయం తెలుసుకుని "వుదయం యెనిమిదిన్నర మొదలు సాయంత్రం నాలుగుగంటలవరకూ కోర్టు స్వాధీనంలో వుంచుకోవచ్చు"నని జవాబు దయచేశారు. వారిద్దరూ అందుకే ఆనందించి, యువతులు పదకొండు గంటలదాకా క్లబ్బులో వుంటారు కనక తమ ఆట వారు తప్పకుండా చూస్తారనీ, దానివల్ల లాభం కలగవచ్చుననీ కూడబలుక్కున్నారు. ఇంకో విశేషం కూడానూ. రాజపుత్రి, తమలో యెవర్ని పెళ్లి చేసుకుంటే వారు, రెండోవారిని దివానుగా వేసుకునేటట్టు వారు ఏర్పాటు చేసుకున్నారని చూచాయగా తెలియవచ్చింది.

ఇవాళ శ్రీరాజాబహద్దరువారి వద్దనుంచి ముందు దుకాణదారుకి కబురు వచ్చింది. ఒక గంట మాట్లాడి అతను వచ్చెయ్యగా హిందీ ప్రచారకుడు వెళ్లాడు. గాంధిగారి హిందీసందేశాన్ని గురించి మధ్యమధ్య అతను చాలా దృఢంగా మాట్లాడాడు.

మధ్యాహ్నపు భోజనాదికం మాములుగానే జరిగిపోయింది.

సాయంత్రం అయిదున్నర గంటలవేళ దుకాణదారూ, హిందీప్రచారకుడూ తటాకంలో స్నానాలు చేస్తున్నారు. అప్పుడు యువతులూ, దొరసానీ, అలా వెడుతూ అక్కడికి వచ్చారు. చెరువులో ధ్వజ స్తంభందగ్గిర తెల్ల తామరపువ్వులు నాలుగు చాలా పెద్దవివున్నాయి. యువతులలో వొకామె యింగితం కనిపెట్టి దొరసాని "వాటిని తెచ్చి

యివ్వగలరా?" అని అడగ్గా దుకాణదారు వెంటనే బయలుదేరాడు. హిందీప్రచారకుడు ఒక్క క్షణం కొరకొరచూసి వుత్తరక్షణంలో దుకాణదారు వెనక్కాల బయలుదేరాడు.

దుకాణదారు పువ్వులు అందుకుని, తీసి, వెనక్కి, బయలుదేరాడు. అప్పటికి హిందీప్రచారకుడు అతన్ని కలుసుకున్నాడు. "పువ్వులు తేవలసిందని యువతులు నాకున్నూ సెలవిచ్చారు; కనక రెండు పువ్వులు మీరు నాకివ్వాలి" అని అతను చెప్పగా దుకాణదారు బదులు చెప్పకుండా వొడ్డుకు యీదుకు రాసాగాడు. దానికి మండిపడి హిందీ ప్రచారకుడు రెండుబారలలో మీదకి వచ్చి పువ్వులు వుళాక్కో బోగా దుకాణదారు చటుక్కున మునిగి వొడ్డున తేలి హిందీప్రచారకు దక్కడ యింకా కనిపెట్టుకునే వుండగా పువ్వులు దొరసాని కిచ్చాడు.

ఈసన్నివేశం చూసి యువతులు చప్పట్లు చరిచారు.

తరవాత హిందీ ప్రచారకుడు వొడ్డుకి వచ్చి కొంచెం దురుసుగా మాట్లాడగా దుకాణాదారు పిడికిళ్లు బిగించి ఆవుద్ధృతం మాన్పించాడు.

## 5

ఆంధ్రపత్రిక - మార్చి 10.

రాజమండ్రి, మార్చి 9:-

5, 6, 7 తేదీలు విశేషాలేమీ లేవు. ఎనిమిదో తేదీ వుదయం, "యువతులు టెన్నిస్ ఆడేటప్పుడు చూడడానికి తనకి సెలవిప్పించ వలసిం"దని కాకినాడ అభ్యర్థి కోరగా రాజాబహద్దరువారు వీలుపడదని జవాబు దయచేశారు.

భోజనాదికం మామూలే.

మధ్యాహ్నం నాలుగ్గంటలకు జమాఖర్చులూ, జవాబులూ దాఖలుచేసి అభ్యర్థులు ఫలితానికి ఎదురు చూస్తూ కూచున్నారు.

కాకినాడ అభ్యర్థి జమాఖర్చు.

జమ 100-0-0.

| | |
|---|---|
| ఖర్చు - మోటారుసైకిలు బాడుగ | 23-0-0 |
| పెట్రోలు | 9-0-0 |
| మరమ్మత్తు | 5-8-0 |
| సిగరెట్ డబ్బాలకు | 4-0-0 |
| సినీమాలు | 3-8-0 |
| చిల్లరలు-టిఫిన్ వగైరా | 6-4-6 |
| ట్రావెలర్సు బంగాళా అద్దె 6 గంటలకు | 1-0-0 |
| | 52-4-6 |

జవాబు - "జమీన్‌దార్లు రైతులను అదుపు ఆజ్ఞలలో వుంచుకోడానికి శ్రద్ధచెయ్యాలి"

విశాఖపట్నం అభ్యర్థి జమాఖర్చులు-

జమ 100-0-0.

| | |
|---|---|
| ఖర్చు-మోటారు సైకిలు అద్దె (సగంవంతు) | 23-0-0 |
| పెట్రోలు | 6-0-0 |
| మరమ్మత్తులు | 6-0-0 |
| టెన్నిస్ బాటు అద్దె | 6-0-0 |
| సిగరెట్ డబ్బాలు | 5-0-0 |
| సినీమాలు | 3-8-0 |
| చిల్లరులు, టిఫిన్ వగైరా | 6-8-0 |
| ట్రావెలర్సు బంగళాఅద్దె 6 గంటలకు | 1-0-0 |
| | 57-8-0 |

జవాబు - "జమీన్‌దార్లు జిల్లాబోర్డులు స్వాధీనపరుచుకోడానికి శ్రద్ధ చెయ్యాలి"

దుకాణదారు జమాఖర్చులు-

జమ 100-0-0

ఖర్చు- 0-0-0

జవాబు - "జమీన్‌దార్లు, డబ్బు ఖర్చు చెయ్యడంలో చాలా జాగ్రత్తగా వుండాలి. రైతులు శిస్తులు పూర్తిగా చెల్లించగలగడానికి జలాధారాలు వగైరాల మరమ్మతు విషయంలో చాలా శ్రద్ధగా వుండాలి"

హిందీ ప్రచారకుడి జమాఖర్చులు-

జమ 100-0-0

ఖర్చు - అమాంబాపతులూ 23-0-0

తా॥క॥ మామగారు అల్లుణ్ణి సాదరు వివరాలు చెప్పమని అడగడం ఉచితం కాదు.

జవాబు - "గాంధిమహాత్ముడు యుగపురుషుడు. ఆయన హిందూదేశానికి హిందీసందేశం యిచ్చారు. జమీన్‌దార్లు తమ రైతులకోసం వూరూరా హిందీ పాఠశాలలు నెలకొల్పి వారిని జాతీయ యోధులుగా తయారుచెయ్యాలి. హిందీ ప్రచారకులకు కాలేజీ ప్రొఫెసర్లతో సమానంగా జీతం యివ్వాలి"

భావకవి జమాఖర్చులు-

జమ 100-0-0

ఖర్చు- 30-8-9

తా॥ క॥ దైనికసాదర్లు రాసిపెట్టుకోడం కవులకూ, రాజబంధువులకూ నామోషీ.

జవాబు - "పూర్వవాఙ్మయం అంతా వోర్థి తుక్కు. అందులో కథలు తప్ప కవిత్వం లేనేలేదు. ఇప్పటి జమీన్‌దార్లు భావకవులను పోషిస్తూ నవ్యసాహిత్యం తయారుచేయించాలి. ప్రతీమనిషీ ప్రణయముగ్ధ దయేటట్టు జమీన్‌దార్లు శ్రద్ధ చెయ్యాలి. అప్పుడు గాని యీ విశాలవిశ్వమానవకోటికి ముక్తి లేదు."

## 6

రాత్రి తొమ్మిదిన్నర అయింది.

సభామండపంలో శ్రీరాజాబహద్దరువారు సింహాసనం అలంకరించివున్నారు. శ్రీరాణీసాహేబావారు పక్కని వొక వున్నతాసనం అలంకరించి వున్నారు. ఆమెకు కుడిదిక్కున దొరసానీ, యువతులూ వరసగా కూచుని వున్నారు. శ్రీరాజాబహద్దరువారి యెడమ వేపున బంధువులూ, మిత్రులూ, నగరంలోని పెద్దలు కొందరూ కూచున్నారు. దివాన్‌జీవారు సింహాసనానికి కిందుగా తమ కుర్చీలో వున్నారు. అభ్యర్థులు యెదటి బంతిలో వున్నారు. వారంతా చాలా అదుర్దాగా వున్నట్టు కనపడుతున్నారు. వారికి వొక పక్కగా ఠాణేదారుగా రున్నారు. పరిచారికలూ, నౌకర్లూ చాలా అడావడిగా తిరుగుతూ ఆపనీ యీపనీ చూస్తున్నారు.

అప్పుడు శ్రీరాజాబహద్దరువారి సెలవు పొంది దివాన్‌జీవారిలా సెలవిచ్చారు.

"శ్రీ రాజాబహద్దరువారు, తమ కొమార్తగారే తమకు కుమారు లని భావించివున్నారు. కడుపున పుట్టిన బిడ్డ వుండగా ఆమె కేమీ లేకుండా చేసి, దత్తత అనే పేరితో యెక్కణ్ణుంచో వొకణ్ణి తెచ్చి కష్టార్జితం - ముప్ఫయిలక్షల రూపాయల ఆస్తి ధారపొయ్యడం శ్రీ వారికి మంచిదిగా కనపడలేదు. ఇదంతా తమ కొమార్తగారూ, ఆమె సంతానమూ అనుభవించాలని శ్రీవారి సంకల్పం. శ్రీ రాణీసాహేబావారి వుద్దేశం కూడా యిదే

అయితే శ్రీరాజపుత్రికి, అప్పటి పరిస్థితులను పట్టి ఎనిమిదో యేటనే వివాహం కావడమూ, అది నిష్ఫలం అయిపోవడమూ అందరూ యెరిగిన విషయాలే. వీరేశలింగం పంతులుగారి రచనలు చదవడంవల్లా, దానిమీద సొంతబుద్ధి వినియోగించడంవల్లా తరుణవితంతువులకు పునర్వివాహం చెయ్యడం చాలా అవసరమని శ్రీరాజాబహద్దరువారు పూర్తిగా నమ్మారు.

ఇది యిలా వుండగా: శ్రీరాజపుత్రిగారు వొక దొరసాని అదుపాజ్ఞల్లో వుండి విద్య నేర్వడంవల్ల ఆస్తినో, అందాన్నో మాత్రమే చూసి, స్త్రీ, పురుషుణ్ణి పెళ్లి చేసుకోగూడదనీ, ఇప్పటి తెనుగు యువకులనేకులు మేడిపళ్లు కాని పురుషశబ్దవాచ్యులు - కారనీ- కనక, ప్రజ్ఞా, ప్రవర్తనా చూసి తమ ప్రేమకి పాత్రం కాదగిన వరుణ్ణి ఎన్నుకోవడం అవసర మనీ నిశ్చయించుకుని యిప్పుడమలుచెయ్యబడ్డ విధానం సూచించారు.

ఈవచ్చినవారిలో యెవరూ నచ్చకపోతే వారు మరో విధంగా ప్రయత్నం చెయ్యవలసిన అవసరం యేర్పడి వుండును; కాని అలాంటి వైషమ్యం యేమీ సంభవించలేదు. ఈవచ్చిన అయిదుగురిలోనూ ఆమెకు వొక యువకుడు నచ్చివున్నాడు. ఆయువకుణ్ణి, యిప్పుడు, శ్రీరాజాబహద్దరువారు, తమ అర్థాసనం దయచేసి తమకందరికీ చూపించతలచివున్నారు."

ఇది వినేటప్పటికి అభ్యర్థులకు యీ ప్రపంచధోరణి యేమీ వున్నట్టు లేదు. రాజపుత్రి ప్రీతీ, రాజదంతుల వుద్దేశమూ .కూడా బ్రహ్మభేద్యంగా వుండడంవల్ల బంధువులూ, మిత్రులూ, తక్కినవారూ పరిపరివిధాల ఆలోచనలుపోతున్నారు.

శ్రీరాజాబహద్దరువారి యింగితం కనిపెట్టి దివాన్‌జీవారు వొకమాటు కాలింగుబెల్లు మోగింపగా రాజబంధువులలో చేరిన యువతు లిద్దరు వెండిపళ్లేలో వుంచుకుని పూలదండలు తెచ్చి సింహాసనానికి రెండుపక్కలా నుంచున్నారు. ఒక నిమిషం ఆగి, దివాన్‌జీవారు, మరోమాటు గంట వాయించగా అలాంటి యువతులే మరియిద్దరు మంగళహారతులు పట్టుకువచ్చి అలాగే రెండువేపులా నుంచున్నారు.

అప్పుడు శ్రీరాజాబహద్దరువారు గంభీరంగా లేచి నుంచుని సభ అంతా వొక్కమాటు కలయచూసి "హోతా రాజగోపాలశాస్త్రి" అని పిలిచారు. వెంటనే దుకాణదారు లేచినుంచుని మోద్పుకేలితో రాజాజ్ఞకోసం యెదురుచూడసాగాడు.

యువతులలో వొకామె సిగ్గుతో మొగం వంచుకోగా తక్కినవా రామెను మేలమాడారు. శ్రీరాణీసాహేబావారు అది చూసి చిరునవ్వు నవ్వారు.

అంతట శ్రీరాజాబహద్దరువారు అభ్యర్థులను సమీపించి, చెయ్యిపట్టుకు తీసుకువెళ్లి దుకాణదారుకి అర్థాసనం యిచ్చారు.

ఇది యిలా జరుగుతూ వుండగా తక్కిన అభ్యర్థులు మొదట బిక్కచచ్చి, తరవాత పౌరుషం తెచ్చుకుని, వెంటనే వెళ్లిపోడానికి లేచినుంచున్నారు; కాని యీలోపుగానే శ్రీరాణీసాహేబావారు తమ కొమార్తను సింహాసనం దగ్గిరికి తీసుకువచ్చి, శ్రీరాజాబహద్దరువారు లేచి పక్కకి వోసరిల్లగా సింహాసనంమీద దుకాణదారు పక్కన - కుడివేపున కూచోపెట్టడమూ, వధూవరులకు మొదటి వరసలో వున్న యువతులు పూలదండలు వెయ్యడమూ, రెండో వరుసలో వున్న యువతులు మంగళహారతులిచ్చెయ్యడమూ వెంటవెంటనే జరిగిపోయాయి.

అప్పటికి తక్కిన అభ్యర్థులు వూచల్లాగ బయటికి వెళ్లిపోయారు. వెంటనే సభలో వున్న వారందరూ కరతాళధ్వనులు చేశారు. అవి తిరస్కృతులయిన అభ్యర్థుల శిరస్సులమీద పిడుగుపాట్లుగానూ, వధూవరుల శిరస్సులమీద పూలవర్షంగానూ, రాజదంపతుల ఔచిత్యానికి ప్రశంసలుగానూ సమంగా అన్వయించాయి.

*(ప్రబుద్ధాంధ్ర - జూలై, 1935)*